
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



సిద్దిపేట

5

శనివారం 21 డిసెంబరు 2024



మర్కుక్ మండలం చేబర్తి పాఠశాల ఆవరణలో ధాన్యం ఆరబెట్టిన రైతులు



నంగునూర్ మండలం సిద్ధన్నపేట పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నర్సరీ

సర్కారీ స్కూళ్ల స్థలాలకు ఎసరు!

- సామాజిక అవసరాల పేరిట వినియోగం
- క్రీడా మైదానాలు.. పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు
- పంచాయతీ వాహనాల పార్కింగ్
- కొన్నిచోట్ల ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు
- పాఠశాల ఆవరణ తగ్గిపోతున్నా పట్టించుకోని అధికారులు

"విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి. వారి సంఖ్యానుగుణంగా అదనపు తరగతి గదులను పెంచుతాం.. మూత్రశాలలు నిర్మిస్తాం. కావాల్సిన ఏర్పాట్లు చేస్తాం.." అంటూ సభలు, సమావేశాల్లో నాయకులు, అధికారులు ఉపన్యాసాలు ఇస్తుంటారు. అయితే, అందుకు సంబంధించిన పనులు చేపట్టడం, క్రీడా సామగ్రి అందించడం ఏమో కానీ.. సామాజిక అవసరాల పేరిట ప్రభుత్వ పాఠశాలలకు చెందిన స్థలాలను వాడుతున్నారు. ఫలితంగా సర్కారీ స్కూళ్ల స్థలాలు క్రమంగా కుచించుకుపోతున్నాయి. ఆ క్రీడా మైదానాలు, ప్రకృతివనాలు అందరికీ ఉపయోగపడుతున్నాయా.. అంటే అదీ లేదు..!

- నంగునూర్/ సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి)

కార్పొరేట్ స్కూళ్ల వల్ల కొన్నిచోట్ల ప్రభుత్వ పాఠశాలల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి పిల్లలు ప్రభుత్వ స్కూళ్లకు వెళ్తున్నారు. అయితే, సామాజిక అవసరాల పేరిట ప్రభుత్వ పాఠశాలలకు చెందిన స్థలాలను వాడుతున్నారు. కొన్ని పాఠశాలల ఆవరణలో నర్సరీలు ఏర్పాటు చేస్తే మరికొన్నిచోట్ల క్రీడా ప్రాంగణాలకు కేటాయిస్తున్నారు. ఇంకొన్ని చోట్ల ప్రకృతివనాలను పాఠశాల ఆవరణలోకే తీసుకొచ్చారు. పాఠశాల ఉమ్మడి ఆస్తి అన్నట్లుగా గ్రామపంచాయతీ వాహనాలను, పలువురు గ్రామస్థులు ట్రాక్టర్లు, ఇతర వస్తువులను భద్రపరిచే స్థలంగా వినియోగిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచడం, అలాగే వారిని క్రీడల్లో ప్రోత్సహించడానికి ఆయా పాఠశాలల స్థలాలను మరింత విశాలంగా చేయాల్సింది పోయి కొంతమంది అనాలోచిత నిర్ణయాల వల్ల ఇరుకుగా మారుతున్నాయి. ఫలితంగా గ్రామాల్లోని పేద బడుగు బలహీనవర్గాల పిల్లల చదువులు, ఆటలు అస్తవ్యస్తమవుతున్నాయి. అక్షరజ్ఞానాన్ని అందించేందుకు అవసరమైన బడుల కోసం కులమతాలకు అతీతంగా స్థలాలను సేకరించారు. కొన్ని గ్రామాల్లో చాలామంది ముందుకొచ్చి తమ సొంత స్థలాలను బడులకు అప్పగించారు. ఇప్పుడు ఆ పాఠశాలల స్థలాలు అధికారంలో ఉండే పార్టీల ప్రాధాన్యత వల్ల కనుమరుగయ్యేలా ఉన్నాయి. పల్లెప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాల పేరిట పాఠశాలల స్థలాలు చాలాచోట్ల తగ్గిపోతున్నాయి.

- నంగునూర్ మండలం సిద్ధన్నపేట ప్రాథమిక పాఠశాల ఆవరణ ప్రహరీ తొలగించి గ్రామస్థులు నిర్మించిన రెండు తరగతి గదులను కూల్చేసి ఆవరణ గుండా బాటను తీశారు. మిగిలిన ఆవరణలోనే పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు. కోనాయిపల్లి ప్రాథమిక పాఠశాలలోనే గ్రామ నర్సరీ ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలోనే గ్రామపంచాయతీకి సంబంధించిన వాహనాలను పెడుతున్నారు. గ్రామపంచాయతీ భవనం కూడా పాఠశాల ఆవరణలోనే ఉంది.
- మద్దూరు మండలం సలాఖ్‌పూర్ పాఠశాల ఆవరణలోనే క్రీడా మైదానం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని పాఠశాలతో పాటుగా మండలంలోని లద్నూర్ పాఠశాలలో ప్రకృతి వనం ఏర్పాటుచేశారు.
- ధూలిమిట్ట మండలం భైరాన్‌పల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటుచేశారు. ఇది

మిగతా 8వ పేజీలో...



నంగునూర్ మండలం కోనాయిపల్లి పాఠశాలలో ఉంచిన గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్



సిద్దిపేట పట్టణంలోని డిగ్రీ కాలేజ్ మైదానంలో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణం

బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి

గజ్వేల్‌కు దక్కేనా?



పోటీలో పలువురు నేతలు

గజ్వేల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్ష పదవి కోసం గజ్వేల్ నియోజకవర్గ నాయకులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కొంతకాలం నుంచి గజ్వేల్ నియోజకవర్గంలో బీజేపీ అనూహ్యంగా పుంజుకుంటుంది. ఈ క్రమంలో నియోజకవర్గానికి చెందిన నాయకుడికి అధ్యక్ష పదవి ఇస్తే మరింత పుంజుకునే అవకాశం ఉందని స్థానిక నాయకులు భావిస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో, ప్రత్యేక సిద్దిపేట జిల్లాలో గజ్వేల్ నియోజకవర్గానికి ఏనాడు బీజేపీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు దక్కలేదు. 2023 నవంబరులో జరిగిన రాష్ట్ర విధాన సభ ఎన్నికల్లో ఇక్కడి నుంచి మాజీ మంత్రి ఈటల రాజేందర్ పోటీ చేయడంతో నియోజకవర్గంలో బీజేపీ ప్రాబల్యం పెరిగింది. ఆ తర్వాత జరిగిన ఎంపీ ఎన్నికల్లో అనూహ్యంగా పుంజుకోవడం, ఆ పార్టీ తరపున మెదక్ ఎంపీగా పోటీ చేసిన రఘునందన్‌రావుకు భారీగా ఓట్లు వచ్చాయి. క్రమంగా బీజేపీ మద్దతు పెరిగింది. ఇటీవల నిర్వహించిన సభ్యత్వ నమోదులో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో గజ్వేల్ నియోజకవర్గం రెండో స్థానంలో ఉండడం, సిద్దిపేట జిల్లాలో మొదటి స్థానంలో ఉండడంతో ఇక్కడి నాయకులకు జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగిస్తే పార్టీ పరిస్థితి మరింత మెరుగుపడే అవకాశం ఉందని సగటు బీజేపీ కార్యకర్తలు కోరుకుంటున్నారు.

ఎన్నడూ దక్కని అధ్యక్ష బాధ్యతలు

గజ్వేల్ నియోజకవర్గంలో 2018 వరకు బీజేపీ తరపున అభ్యర్థులకు 2వేలు, 3వేలకు మించి ఎన్నడూ ఓట్లు పోలైన దాఖలాలు లేవు. అనూహ్యంగా 2019లో పెద్దగా నాయకుల ప్రాబల్యం లేకున్నా అప్పుడు ఎంపీగా బీజేపీ తరపున పోటీ చేసిన రఘునందన్‌రావుకు 33వేల ఓట్లు వచ్చాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి 66వేల పైచిలుకు ఓట్లు, 2024 పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి రఘునందన్ రావుకు 62 వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. ఇలా నియోజకవర్గంలో కమలం క్రమంగా పుంజుకుందని నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన నాయకులకు జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగిస్తే పార్టీ మరింత ముందుకు పోయే పరిస్థితి ఉంటుంది.

ఆశావహుల ప్రయత్నం

గజ్వేల్ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ నాయకుల్లో పలువురు జిల్లా పార్టీ బాధ్యతలను దక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. బీజేపీకి చెందిన బీసీ నాయకుడు, న్యాయవాది, మెదక్ పార్లమెంట్ కో కన్వీనర్‌గా పనిచేస్తున్న నలగామ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ధారం గురువారెడ్డి, ఐటీ సెల్ అధ్యక్షుడిగా పనిచేసిన వెంకటరమణతో పాటు పలువురు నాయకులు జిల్లా అధ్యక్ష బాధ్యతల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. రెండు పర్యాయాలు సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన నాయకుడికి బాధ్యతలు దక్కడం, ప్రస్తుతం స్థానికేతరుడు అధ్యక్షుడిగా ఉండడంతో తమను పరిగణలోకి తీసుకోవాలని స్థానిక నాయకులు కోరుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర నాయకత్వాన్ని, కేంద్ర మంత్రులను, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావును కోరుతున్నట్లు బీజేపీ కార్యకర్తల ద్వారా తెలిసింది.

కొండపోచమ్మ ఆలయంలో టెండర్లు పూర్తి

- వేలంలో దక్కించుకున్న స్థానికేతరులు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కొండపోచమ్మ ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిగుల్ నర్సాపూర్‌లోని కొండపోచమ్మ ఆలయంలో కొన్నేళ్లుగా స్థానికులే టెండర్లను దక్కించుకుంటున్నారని, స్థానికేతరులకు అవకాశం ఇవ్వడం లేదన్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' పత్రికలో "పేరుకే బహిరంగ వేలం.. అంతా సిండికేట్" శీర్షికన ప్రచురితమైన కథనానికి దేవాదాయశాఖ తీవ్రంగా పరిగణించింది. శుక్రవారం ఆలయ సమీపంలోని కల్యాణ మండపంలో ఆలయం వద్ద ఈవో రవికుమార్, ఆలయ పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. కొబ్బరికాయలు, ఒడిబియ్యం టెండర్ వివరాలను అధికారులు తెలియజేస్తుండగా స్థానికులు కలగజేసుకుని తమకే కేటాయించాలని పట్టుబట్టారు. ఇతరులు వేసిన టెండర్ల కన్నా ఎక్కువ పాట పాడి దక్కించుకోవాలని అధికారులు సూచించారు. దీంతో కాసేపు వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఆ రెండింటినీ తాత్కాలికంగా వాయిదా వేసి మిగతా వాటికి వేలం నిర్వహించారు. వేలం పూర్తయ్యాక కొబ్బరికాయలు, ఒడిబియ్యం టెండర్ నిర్వహించారు.

వార్షిక ఆదాయం రూ.43.71 లక్షలు

కొబ్బరికాయలు, పూజా సామగ్రిని రూ.18 లక్షలకు గురువన్నపేటకు చెందిన లావణ్యరమేశ్, అమ్మవారి ఒడిబియ్యం రూ.17.27 లక్షలకు చాట్లపల్లికి చెందిన అశోక్, కొబ్బరిముక్కలను రూ.5.61 లక్షలకు తిగుల్ నర్సాపూర్‌కు భాను, షాపు నంబర్-2ను నెలకు రూ. 17,500 చొప్పున గురువన్నపేటకు చెందిన బచ్చలి కిశోర్, దుకాణం నంబర్-5 తిగుల్ నర్సాపూర్‌కి చెందిన బచ్చలి కిషోర్, తడకల పందిరి రూ.95 వేలకు దర్పల్లకు చెందిన నర్సింహులు దక్కించుకున్నారు. ఈ వేలం పాట 20 డిసెంబరు 2024 నుంచి 20 డిసెంబరు 2025 వరకు వేలం దక్కించుకున్న వారికే అమ్ముకునే అవకాశం ఉంటుందని ఈవో రవికుమార్ తెలిపారు. ఎలాంటి గొడవలు జరగకుండా సీఐ మహేందర్ రెడ్డి, జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బుగ్గ రాజరాజేశ్వరి టెంపుల్ సూపర్‌వైజర్ శ్రీధర్‌రెడ్డి, సిద్దిపేట వేంకటేశ్వరస్వామి టెంపుల్ సూపర్‌వైజర్ చంద్రకుమార్, సిద్దిపేట హనుమాన్ టెంపుల్ సూపర్‌వైజర్ శ్రీకాంత్‌రెడ్డి. ఎస్ఐ చంద్రమోహన్, పాలక మండలి సభ్యులు ఆశయ్య, చెక్కల నరేశ్, గ్రామ మాజీ సర్పంచ్ రజిత రమేశ్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌రెడ్డి, కనకయ్య, హరిబాబు, గ్రామస్తులు యాదగిరి,కనకరెడ్డి, శ్రీను, స్వామి పాల్గొన్నారు

కుమిలిపోయాం.. మళ్లీ ప్రాణం వచ్చింది

- బోరుమన్న లగచర్ల బాధితులు
- జైలు నుంచి విడుదల

7



ఆశావర్కర్లను పర్మినెంట్ చేయాలి

- రూ.26వేల వేతనం చెల్లించాలి
- సిద్దిపేటకు చేరుకున్న బస్సుజాత
- పట్టణంలో భారీ ర్యాలీ

7



బతుకమ్మ ఆడి.. నిరసన తెలిపి..

- 11వ రోజుకు సమగ్రశిక్షా ఉద్యోగుల ధర్నా

8



ప్రాణం పోయినా భూములివ్వం

- ట్రిబుల్‌ఆర్ బాధితులు

మర్కుక్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం నరసన్నపేట శివారులో ట్రిబుల్‌ఆర్ భూసేకరణలో భాగంగా శుక్రవారం మండల తహసీల్దార్ ఆరిఫా ఎస్ఐ దామోదర్‌తో కలిసి సందర్శించారు. విషయం తెలుసుకున్న ట్రిబుల్‌ఆర్ బాధితులు అధికారులను అడ్డుకున్నారు. ప్రాణాలు పోయినా సరే.. భూములను ఇచ్చేది లేదంటూ వాగ్వాదానికి దిగారు. సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వారు వినకపోవడంతో అధికారులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ఉగాది రోజు మంత్రి కోమటిరెడ్డి ట్రిబుల్‌ఆర్ రద్దు చేసి మీవైపు ఉంటానని హామీ ఇచ్చారని, ఇప్పుడు మళ్లీ అధికారులను పంపడం ఏంటని ప్రశ్నించారు. మాట ఇచ్చి తప్పిన కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



రైతులకు నచ్చజెబుతున్న తహసీల్దార్ ఆరిఫా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపాక, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం దుద్దెడ 132 సబ్‌స్టేషన్ పరిధిలోని కొండపాక, మేదినిపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ సత్యం తెలిపారు. మేదినీపూర్ ఫీడర్ పరిధిలోగల గ్రామాల్లో ఉదయం 10 నుంచి 11.30 వరకు, కొండపాక ఫీడర్ పరిధిలో 11.30 నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మల్లన్న కల్యాణ ఏర్పాట్లు 25లోగా పూర్తవ్వాలి

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగొద్దు
- క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ఆపేయండి : కలెక్టర్

చేర్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 25లోగా కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవ ఏర్పాట్లు పూర్తిచేయాలని, అన్ని ప్రభుత్వశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు. ఈనెల 29న మల్లన్న కల్యాణం నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్, సీపీ అనురాధ ఆలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ పరిసరాలలో పర్యటించారు. కల్యాణ, బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. కల్యాణం జరిగే తోటబావి వేదిక వద్ద పటిష్ఠ బారీకేడ్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆలయ పరిసరాల్లో షాపు యజమానులకు ఫైర్‌సేఫ్టీపై అవగాహన కల్పించాలని, అలాగే ప్రతీ షాపులో ఫైర్‌మేజర్ స్టేఫీ పరికరాలను నెలకొల్పాలని సూచించారు. 24 గంటలపాటు తాగునీటిని సరఫరా చేయాలని నీటిపారుదలశాఖాధికారులకు తెలిపారు. ఆలయ పరిసరాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు ముమ్మరంగా చేపట్టాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలన్నారు. అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు.



క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులు పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, పక్కన సీపీ

పనులు నిలిపివేయాలి

ఆలయ ప్రాంగణంలోని క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. ఆరుబయట నుంచి క్యూలైన్లు ఏర్పాటుచేయనున్నందున క్యూ కాంప్లెక్స్ భవనం నిర్మాణ పనులు నిలిపి వేయాలని చెప్పారు. భవన ప్రాంగణంలో ఇసుక, డస్ట్, కర్రలు నిల్వ పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. ప్రస్తుత జాతరకు ఉపయోగపడని నేపథ్యంలో పనులు నిలిపివేయాలని సూచించారు. అనంతరం ఎల్లమ్మగుట్టపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. త్రిశూలం, ఢమరుకం పనులు, బండగుట్టపై నిర్మిస్తున్న 50 గదుల సత్రం భవనం పనులు పరిశీలించారు. ఆలయానికి భక్తులు చేరుకునే మార్గాలు పరిశీలించి సూచనలందించారు. వారి వెంట అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్వో నాగరాజమ్మ, ఈవో బాలాజీ, విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రమోహన్, డీఎంఅండ్‌హెచ్‌వో పల్వాన్‌కుమార్, డీపీవో దేవకీదేవి, తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో ఫ్లాగ్‌మార్చ్

హుస్నాబాద్‌లో శుక్రవారం సాయంత్రం రాపిడ్ యాక్షన్‌ఫోర్స్ (ఆర్ఏఎఫ్) బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి మల్లె చెట్టు చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, మార్కెట్ యార్డు వరకు ఫ్లాగ్‌మార్చ్ జరిపారు. ఇక్కడి భౌగోళిక పరిస్థితులు ఆకళింపు చేసుకోవడానికి ఈ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారని సీఐ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టీపీ బగేల్, హరిబాబు, మల్లేశ్వర్‌రావు, హుస్నాబాద్, కోహెడ ఎస్ఐలు తోట మహేశ్, అభిలాష్ పాల్గొన్నారు.

- హుస్నాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి)



అంతా గణితమయం

● ప్రొఫెసర్ వై.ఎన్.రెడ్డి ● గీతంలో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 20 : ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోగలిగే ఏకైక భాష గణితం అని, గణితం లేని ప్రదేశం, జీవితం లేదని, అంతా గణితమయమని ఎన్‌ఐటీ వరంగల్ గణిత శాస్త్ర ఆచార్యుడు ప్రొఫెసర్ వైఎన్ రెడ్డి అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. గణితం: నేర్చుకునే భాష అనే అంశంపై డాక్టర్ వైఎన్ రెడ్డి ఉపన్యసించారు. భారతీయులకి గణిత శాస్త్రంపై పట్టు అపారమని, దీనిని యువత గుర్తెరిగి, ఆ రంగంలో రాణించేందుకు యత్నించాలని పిలుపునిచ్చారు. గణితంపై పట్టు సాధిస్తే, ఎంతటి చిక్కు సమస్యనైనా సులువుగా పరిష్కరించవచ్చని, అందుకే భారతీయులు అత్యున్నత స్థానాలలో రాణిస్తున్నట్టు చెప్పారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

రాయపోల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగిన ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన రాయపోల్ మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్కల్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌చారి(25) ఈనెల 9న గడ్డి మందు తాగగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు.




ఒకే నంబరుతో సంగారెడ్డిలో తిరుగుతున్న ఇతర రాష్ట్రాల వాహనాలు (ఫైల్)

ఫిర్యాదు చేస్తే బెదిరింపులు

● సంగారెడ్డి జిల్లాలో నంబర్ల మాయాజాలం
● ఒక్కో నంబర్ ప్లేట్‌తో రెండేసి వాహనాలు
● యాత్రలకు వ్యాన్లు, ఇసుక రవాణాకు టిప్పర్లు
● యథేచ్ఛగా తిరుగుతున్న ఇతర రాష్ట్రాల బండ్లు
● ఫిర్యాదు చేస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్న ఆర్టీఏ అధికారులు

కంది, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు ఒకే నంబర్ ప్లేట్‌పై సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా యథేచ్ఛగా తిరుగుతున్నాయి. దర్జాగా రెండు వాహనాలు తిరుగుతన్నా ఆర్టీఏ అధికారులు నిమ్మకునీరెత్తనట్టుగా వ్యవహరిస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్రాల సరిహద్దులు కలిగిన సంగారెడ్డి జిల్లాలో డబుల్ నంబర్ల మాయాజాలం హాట్‌టాపిక్‌గా మారింది. ఇలా తిరుగుతున్న వాహనాలపై జిల్లాలోని ట్రావెల్ ఏజెన్సీల వారు ఆర్టీఏ అధికారులకు ఫిర్యాదు చేస్తే.. మీకేం సంబంధం అంటూ బెదిరిస్తున్నారని వారు వాపోతున్నారు.

ఆర్టీఏ అధికారుల నుంచి బెదిరింపులు

కొన్ని రోజులుగా జిల్లా పరిధిలోని జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి, పటాన్‌చెరు తదితర పట్టణాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ఓన్ నంబర్ ప్లేట్ కలిగిన వాహనాలు రెండేసి, మూడేసి తిరగడాన్ని 'ఆంధ్రజ్యోతి' ఈనెల 4న వెలుగులోకి తీసుకొచ్చింది. అదే సమయంలో కొందరు ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు డబుల్ నంబర్ వాహనాలతో, ఇతర రాష్ట్ర ట్యాక్సీలతో తమకు నష్టం వాటిల్లుతుందని ఏఐటీయూసీ నాయకులతో కలిసి కందిలోని సంగారెడ్డి ఆర్టీఏ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అయితే వారికి న్యాయం చేయాల్సిన ఆర్టీఏ అధికారులు పట్టనట్లుగా వ్యవహరించారు. కాగా, రెండేసి నంబర్లతో తిరుగుతున్న వాహనాల్లో ఒకదాన్ని ఆర్టీఏ అధికారులు పట్టుకుని కొన్ని రోజులు వారి ఆధీనంలో ఉంచుకొని వదిలేసినట్లు సమాచారం. మరో వాహనాన్ని నియంత్రించడం కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయనట్లు తెలుస్తున్నది. అంతేకాక ఈ విషయం వెలుగులోకి తీసుకవచ్చిన కొందరు ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులను ఆర్టీఏ అధికారులు వారి కార్యాలయంలోకి పిలిపించుకుని వరుస క్రమంలో నిలబెట్టి వీడియోలు తీయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తూ బెదిరించారని వారు వాపోయారు. 'మీకేం అధికారం ఉందని, మీరేమైనా ప్రభుత్వ అధికారులా' అంటూ దూషిస్తూ భయపెడుతున్నారని తెలిపారు. అంతేకాక అలాంటి వాహనాల విషయాల్లో జోక్యం చేసుకున్న వారి ట్రావెల్ ఏజెన్సీలను ఆర్టీఏ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఆర్టీఏ అధికారుల తీరుతో తమకు తీవ్ర మానసిక క్షోభ కలిగిందని, అందుకే తాము మానవ హక్కుల సంఘంతో పాటు ప్రజా సంఘాలకు ఫిర్యాదు చేయనున్నట్లు ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. డబుల్ నంబరు ప్లేటున్న వాహనాలను ఆర్టీఏ అధికారులు ప్రోత్సహిస్తున్నారా, లేక రాజకీయ ఒత్తిడికి తలగుతున్నారా అనేది తెలియాల్సి ఉన్నది.



ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం

మహారాష్ట్ర వాహనాల వైపే మొగ్గు

జిల్లాలోని జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి పటాన్‌చెరు పట్టణాల్లో అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తులు శబరి మలై యాత్ర కోసం తక్కువ ధరకు వస్తున్నాయని మహారాష్ట్రకు సంబంధించిన ట్యాక్సీ వాహనాలను ఎక్కువగా బుక్ చేయడంతో ఇక్కడి ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు నష్టాల్లో కూరుకుపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో మినీ వ్యాన్లకు 10 ప్లస్ 2 సీట్ల వరకు ఓన్ నంబర్ ప్లేట్‌తో అక్కడి రవాణా శాఖ అధికారులు అనుమతులు ఇస్తున్నట్టు సమాచారం. అయితే ఇక్కడ కొందరు దళారులు రాజకీయ నాయకుల అండదండలతో, రవాణశాఖ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని మహారాష్ట్రలో పర్మిషన్‌తో ఓన్‌ప్లేట్ కలిగిన చిన్నచిన్న వ్యాన్లు కొనుగోలు చేసుకుంటున్నారు. వాటిని మన రాష్ట్రంలో తిప్పడమే కాకుండా, ఆ వాహనాలకు సంబంధించిన పరిమితిని 25 సీట్లకు పెంచి అతి తక్కువ ధరలకు యాత్రలకు అద్దెలకిస్తూ వాహనాలను ఇష్టరాజ్యంగా నడుపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల సంగారెడ్డి జిల్లాలో క్రమం తప్పకుండా రోడ్డు టాక్సీ కడుతున్న స్థానిక ట్రావెల్ ఏజెన్సీ నడుపుతున్న నిర్వాహకులు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● గత రెండు సంవత్సరాల క్రితం కంది మండలంలోని బ్యాతోల్‌లో అక్రమ ఇసుక రవాణా చేస్తూ కొన్ని లారీలు, టిప్పర్లు రెవెన్యూ అధికారులకు పట్టుపడ్డాయి. వీటిలో కొన్నిటికి డబుల్ నంబర్ ప్లేట్ ఉండడం గమనార్హం. ఈ విషయమై అప్పటి రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా తనఖీ నిర్వహించారు తప్ప డబుల్ నంబర్ ప్లేట్ కలిగిన వాహనాలను కట్టడి చేయలేకపోయారు

● ఈ నెలలో సదాశివపేట పట్టణంలో, సంగారెడ్డిలో మహారాష్ట్రకు సంబంధించిన ఒకే నంబర్ గల రెండు మినీ వ్యాన్లు తిరుగుతుంటే ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఆ వాహనాలను అడ్డుకోవడంలో రవాణా శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

కొడుకును కర్రతో కొట్టి చంపిన తండ్రి

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 20 : జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసగా మారిన కుమారుడిని తండ్రే కొట్టి చంపిన ఉదంతం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెంది. అత్తెల్లి వెంకటరెడ్డి (34) రోజు మద్యం తాగుతూ.. మత్తులో తల్లిదండ్రులపై దాడులకు పాల్పడేవాడు. రెండేళ్ల క్రితం తండ్రి అనంత్‌రెడ్డిపై దాడికి పాల్పడడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంకట్‌రెడ్డిపై కేసు కూడా నమోదైంది. అయినా తీరు మార్చుకోకుండా తల్లిదండ్రులను వేధిస్తుండేవాడు. అదే గ్రామంలో ఉంటున్న సోదరి ఇంటికి వెళ్లి ఊరు వదిలి వెళ్లిపోవాలంటూ బెదిరించాడు. వెంకట్‌రెడ్డికి వివాహం కాగా, అతడి చర్యల వల్ల భార్య వదిలేసి వెళ్లిపోయింది. ఈ క్రమంలో శుక్రవారం తండ్రీకొడుకుల మధ్య గొడవ జరిగింది. తీవ్ర ఆగ్రహానికి గురైన అనంతరెడ్డి కొడుకు వెంకట్‌రెడ్డి తలపై కర్రతో బలంగా కొట్టాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మనోహరాబాద్ డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన శుక్రవారం మండల పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా సూతారిగూడ గ్రామానికి చెందిన నత్తి మల్లేష్ (75) మనోహరాబాద్ నుంచి మేడ్చల్ వైపు బైక్‌పై వెళుతుండగా 44వ జాతీయ రహదారిపై దండుపల్లి వద్దకు రాగానే అతి వేగంతో వచ్చిన డీసీఎం ఢీకొన్నది. మల్లేష్ తలకు తీవ్ర గాయాలై కిందపడటంతో స్థానికులు మేడ్చల్ ప్రభుత్వాస్పత్రికి తలించగా వైద్యులు పరిక్షించి మృతిచెందడని తెలిపారు. కుమారుడు నత్తి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గూడ్స్ రైలుపైకి ఎక్కి హల్‌చల్

చేగుంట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం వడియారం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నం చేశాడు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ముఖేష్ వడియారం రైల్వే స్టేషన్‌లో ఆగివున్న పెట్రోల్‌తో కూడిన గూడ్స్ రైలు ట్యాంక్ పైకి హైటెన్షన్ విద్యుత్ వైర్లు పట్టుకోవాడానికి ప్రయత్నం చేశాడు. అది గమనించిన రైల్వే స్టేషన్‌లోని పాయింట్స్ మేన్ దేవేందర్, సిబ్బంది అతనికి నచ్చజెప్పి చాకచక్యంగా కిందికి దింపారు. దాంతో పెనుప్రమాదం తప్పింది.



గూడ్స్ రైలుపై నుంచి దింపేందుకు ప్రయత్నిస్తున్న రైల్వే సిబ్బంది

పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన రైస్‌మిల్లుపై కేసు

రామాయంపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భారీగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసిన ఓ రైస్‌మిల్లుపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కేసు నమోదు చేశారు. గురువారం మిల్లులో సోదాలు కొనసాగగా.. 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారుల బృందం స్వాధీనపరచుకున్న విషయం విధితమే. అయితే అర్ధరాత్రి దాకా తనిఖీలు జరిపిన పిదప అధికారుల బృందం మిల్లు నిర్వాహకులపై చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం మరోమారు పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు చేరుకుని బియ్యం లెక్కలు తేల్చారు.

క్రైం కార్నర్

కేజ్ వీల్స్ కింద పడి డ్రైవర్ మృతి



ప్రభాకర్ (ఫైల్)

వెల్దుర్తి, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : ప్రమాద వశాత్తు ట్రాక్టర్ కేజ్ వీల్స్ కింద పడి డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని ఆరె గూడెంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మెరుగు ప్రభాకర్(37) అదే గ్రామంలోని కుక్కల శంకర్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు కిందపడగా ట్రాక్టర్ వెనకభాగంలో ఉన్న గొర్రు తలకు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రభాకర్‌ను వెంటనే తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని అక్కడి వైద్యులు నిర్ధారించారు. ప్రభాకర్‌కు భార్య యశోద, పదేళ్లలోపు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఘటనపై భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

అప్పులబాధతో ఒకరి ఆత్మహత్య



ప్రభాకర్ (ఫైల్)

సిద్దిపేట రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో మనస్తాపానికి గురై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. సిద్దిపేట రూరల్ పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్మురాజుల కనకయ్య(48) ఐదేళ్ల క్రితం ఇల్లు నిర్మించుకున్నాడు. ఇద్దరు ఆడపిల్లలకు వివాహం చేశాడు. దీంతో రూ.15 లక్షల వరకు అప్పులు అయ్యాయి. వాటిని తీర్చే క్రమంలో ఇంటిపై, ట్రాక్టర్‌పై ప్రైవేటు బ్యాంకులో రుణం తీసుకున్నాడు. అయినప్పటికీ అప్పులు తీరకపోవడంతో రోజు ఇంటి వద్ద బాధపడుతుండేవాడు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రంతా వెతికినా ఆచూకీ తెలియలేదు. ఉదయం మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు కనకయ్యను వెతుకుతుండగా గ్రామానికి చెందిన ఓ రైతు మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కనకయ్య కుమారుడు కొమ్మురాజుల కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగిన ఆటో డ్రైవర్..

చికిత్స పొందుతూ మృతి



పంగ యాదగిరి మృతదేహం

రాయపోల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం పరిధిలో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు, రాయపోల్ ఎస్‌హెచ్‌వో దేవయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పంగ యాదగిరి(48) కొంతకాలంగా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఉంటూ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 14న తన ఆటోలో కొత్తపల్లి గ్రామానికి వచ్చిన అతడు ఆర్థిక, కుటుంబ సమస్యలతో పురుగుల మందు తాగాడు. ఈ విషయం గమనించిన గ్రామస్థులు ఆయనను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

- చెరువు వద్ద దుస్తులు, సెల్‌ఫోను, చెప్పులు లభ్యం
- లభించని ఆచూకీ



ప్రభాకర్ (ఫైల్)

శివ్వంపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల నుంచి పిట్టలవాడలో ఓ వ్యక్తి వ్యక్తి అదృశ్యమైన సంఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని సికింద్లాపూర్ పిట్టలవాడకు చెందిన విక్రమ్ కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 18న రాత్రి 10 గంటలకు భోజనం చేసి కుటుంబ సభ్యులతో కలిసి పడుకున్నాడు. ఉదయం భార్య సునీత చూసేసరికి విక్రమ్ కనిపించలేదు. చుట్టుపక్కల బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ తెలియలేదు. గురువారం గోమారం చెరువు చుట్టుపక్క ప్రాంతంలో వెతుకుతుండగా చెరువు వద్ద విక్రమ్ చెప్పులు, ప్యాంట్, ఫోన్ లభించిందని కానీ అతడి ఆచూకీ తెలియలేదు. భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.



లగచర్ల బాధితులకు స్వాగతం పలుకుతున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్, గిరిజన సంఘాలు నాయకులు

కుమిలిపోయాం.. మళ్లీ ప్రాణం వచ్చింది

బోరుమన్న లగచర్ల బాధితులు.. జైలు నుంచి విడుదల



'పోలీసు దెబ్బల నొప్పులతో, కుటుంబసభ్యులు గుర్తొచ్చి ఇన్నాళ్లు జైలులో కుమిలిపోయాం.. బయటకు రావడంతో మళ్లీ ప్రాణం వచినట్లుంది' అని లగచర్ల బాధితులు తెలిపారు. గత నెల వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం లగచర్లలో కలెక్టర్, మరికొందరు అధికారులపై దాడిచేసిన ఘటనలో అరెస్టయిన వారు శుక్రవారం ఉదయం విడుదలయ్యారు. నెలరోజులకుపైగా సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఉన్న లగచర్ల, పులిచెర్లకుంట తండా, రోటిబండ తండా, హకీంపేట గ్రామాలకు చెందిన 17 మందికి షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. వారి విడుదల నేపథ్యంలో కందిలోని జైలు గేటు వద్ద పోలీసులు భారీ ఎత్తున మోహరించారు. లగచర్ల బాధితులు జైలు గేటు నుంచి మూటముల్లెలను పట్టుకుని భావోద్వేగంతో నడుచుకుంటూ రోడ్డుమీదకు వచ్చారు. అక్కడ తమ కుటుంబసభ్యులను చూసి ఒక్కసారిగా బోరుమన్నారు. వారికి అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్, గిరిజన సంఘాల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నాడు నెట్‌వర్క్ తీసేసి, అర్ధరాత్రి ఒంటి గంటకు ఊర్ల మీద పడి ఎత్తుకెళ్లిన ఘటనను గుర్తు చేసుకుని కన్నీరుమున్నీరయ్యారు. అరెస్టయ్యామనే సంగతి కూడా ఎవ్వరికి తెలియకుండా చేసి, పరిగి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టినట్లు తెలిపారు.

– కంది, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి)

గుండె సమస్య ఉందని చెప్పినా వినలేదు



నాకు ఆరోగ్యం బాగాలేదని, గుండెనొప్పి సమస్య ఉందని చెప్పినా పోలీసులు విడవకుండా అన్యాయంగా అరెస్ట్ చేశారు. పరిగి పోలీస్‌స్టేషనుకు తోలుకొచ్చి ఇష్టం వచ్చినట్లు కొట్టారు. మా భూమి ఇవ్వాలని తొమ్మిది నెలల నుంచి తిప్పల పెడుతున్నారు. మా రెండు తండాలు, మూడు గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలను ఎన్నో విధాలుగా ఇబ్బంది పెట్టారు. సీఎం బంధువులు మాపై దాడి చేశారు. మేము ప్రభుత్వానికి భూములు ఇస్తే మా పరిస్థితి ఏంటి. నాకు ఐదు ఎకరాల భూమి ఉన్నది. ఎకరాకు పది లక్షలు ఇంటికో ఉద్యోగం అంటే ఎలా ఇచ్చేది. కలెక్టర్ దాడి చేసిన ఘటనలో నేను లేనే లేను. నన్ను అన్యాయంగా ఇరికించారు.

– హీర్యానాయక్, పులిచెర్ల కుంట తండా

కుటుంబ సభ్యులు గుర్తొచ్చి రోజూ కుమిలిపోయాను



వ్యవసాయం చేసుకుని బతికే నన్ను అక్రమ కేసులో దోషిని చేశారు. పోలీసులు కొట్టింది చాలక జైల్లో పెట్టించారు. ప్రతీ రోజు కుటుంబ సభ్యులు గుర్తుకొచ్చి కుమిలిపోయేవాడిని. భయంతో రాత్రిపూట జైలులో నిద్రపట్టేది కాదు. మమ్మల్ని ఎంత వేధించినాగానీ మా భూమలును వదులుకోం. ఆ రోజు దాడి ఘనటలో మేం లేకున్నాగానీ మమ్మల్ని బలవంతంగా నిర్బంధించారు.

– లక్ష్మయ్య, లగచర్ల

చావనైనా చస్తాం.. భూములైతే ఇవ్వం



ఫార్మా ఇండస్ట్రీ కోసం, మరే పరిశ్రమ కోసమూ మా భూములను వదులుకోం. మేము వ్యవసాయాన్ని నమ్ముకున్నాం. తాతముత్తాతల కాలం నుంచి వ్యవసాయమే మాకు జీవనాధారం. చావనైనా చస్తాం కానీ భూములు మాత్రం ఎవ్వరికీ ఇవ్వం. మా భూముల్లో వ్యవసాయమే చేయాలని నిర్ణయించుకున్నాం. మాలాంటి అన్నదాతలకు అందరూ అండగా ఉండాలి. అన్యాయంగా అక్రమంగా మాపై కేసులు బనాయించి జైల్లో పెట్టారు.

– దోరమని బాలకృష్ణయ్య, హకీంపేట

ఈ గొడవతో ఇన్నాళ్లు కుటుంబానికి దూరం



నేను విడుదల అవుతున్నాని నా కూతురు జైలు వద్దకు వచ్చింది. వేయి కండ్లతో నా రాక కోసం నిరీక్షించింది. తనను చూడగానే నాకు మళ్లీ ప్రాణం వచ్చినట్లు అయ్యింది. ఈ దరిద్రం గొడవల వల్ల ఇన్ని రోజులు కుటుంబానికి దూరంగా బతకాల్సి వచ్చింది. పోలీసులు మమ్మల్ని ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా గానీ మేము భూముల్ని మాత్రం ఎవ్వరికీ ఇయ్యం. చచ్చే వరకు పోరాడైనా భూముల్ని దక్కించుకుంటాం.

–జర్పు ఈర్యానాయక్, రోటి బండ తండా

జీవితంలో జైలు చూస్తా అనుకోలే



నా జీవితంలో జైలు అంటే ఎలా ఉంటుందో చూస్తా అని అనుకోలేదు. అన్యాయంగా అరెస్టు చేసి తీసుకొచ్చారు. నేను సౌదీలో పని చేసుకుంటాను. భోజనం చేసి టీవీ చూసి పడుకున్న. సాయంత్రం 6 గంటలకు ఒక్కసారిగా అకస్మాత్తుగా 30 మంది పోలీసులు వచ్చి మాపై దాడి చేశారు. నా మొబైల్ తీసుకున్నారు. పరిగి సబ్ జైల్లో పెట్టి మమ్మల్ని కొట్టారు. కేసు ఉన్న కారణంగా.. నేను వీసా కోసం కట్టిన డబ్బు వృథా అయింది. ఆరోజు దాడి జరిగిన సమయంలో నేను అక్కడ లేను. గుండెలు పగిలేలా ఏడ్చిన పోలీసులు కనికరించకుండా విచక్షణారహితంగా కొట్టి జైల్లో పెట్టారు. మా వాళ్లు గుర్తుకొచ్చి జైల్లో ప్రతిరోజు మనోవేదనకు గురి అయ్యాను.

–పాత్లవత్ శ్రీనునాయక్

పోలీసులు అత్యుత్సాహం చూపారు

కలెక్టర్‌పై దాడి జరిగిన రోజు మా గ్రామంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. దాడి ఘటనలో ఎవరున్నారో చూడకుండా వారికి కనపడిన ప్రతి ఒక్కరిని కొట్టి, ఇష్టరాజ్యంగా అరెస్టులు చేశారు. పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లి నేరస్తుల కంటే ఘోరంగా మమ్మల్ని కొట్టారు. కనీసం మా కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడనివ్వకుండా నిర్బంధించారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే. మాలాంటి అమాయక ప్రజలను, అన్నదాతలను జైల్లో వేయడం సబబు కాదు.

– బసప్ప మాజీ సర్పంచ్

కరెంటు తీసేసి.. ఎంక్వయిరీ ఉందని చెప్పి



అర్ధరాత్రి ఒంటిగంటకు కరెంటు తీసేసి ఎంక్వయిరీ ఉంది అని చెప్పి మమ్మల్ని బలవంతంగా అరెస్టు చేశారు. పోలీసు ఇష్టారాజ్యంగ కొట్టి వారి ప్రతాపాన్ని మాపై చూపారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతులను వేధించడం సబబుగా ఉందా. భూములు ఇవ్వకుంటే అక్రమ అరెస్టులు చేయిస్తారా? వ్యవసాయం చేసుకునే మేము జైలు జీవితం గడపాల్సి వచ్చింది. ఇన్ని రోజులు మనోవేదనతో మాలో మేమే కుమిలిపోయాం.

– మాణిక్య శ్రీశైలం, హకీంపేట

నా భార్య గర్భవతని చెప్పినా వినలేదు



నా భార్య గర్భవతి అని చెప్పినా వినలేదు. బలవంతంగా లాక్కొచ్చి అరెస్ట్ చేశారు. ఆ వీడియోలో పక్కన కనపడడమే నేను చేసిన పాపం. అందరికంటే ఎక్కువగా నన్నే కొట్టారు. నన్ను ఒక్కన్నే ఎనిమిది మంది పోలీసులు కొట్టారు. నన్ను ఎవరితో మాట్లాడనివ్వలేదు. ఘోరమైన బూతులు తిడుతూ అవమానించారు. ఇది రాజకీయ పార్టీల బలవంతపు అరెస్టునే తప్ప. మేము అధికారులపై ఎలాంటి దాడికి పాల్పడలేదు.

– పాత్లవత్ ప్రవీణ్ కుమార్, పులిచెర్ల కుంట తండా

కావాలనే మమ్మల్ని అరెస్ట్ చేయించారు



ఆ రోజు నాతో పాటు పది మంది పొలాల్లో పనిచేసుకుంటున్నారు. అది తెలిసినా కావాలనే మమ్మల్ని అరెస్ట్ చేయించారు. ఇన్ని రోజులు మమ్మల్ని జైల్లో ఎందుకు పెట్టారో మాకు అర్థం కావడం లేదు. మాలాంటి అమాయకులను జైల్లో పెట్టడం సమంజసం కాదు. మేమంతా వ్యవసాయం చేసుకొని బతికేటోళ్లు. పాకిస్తాన్-ఇండియా కంటే ఘోరంగా దాడి చేసి ఏదో తీవ్రవాదులను తీసుకొచ్చినట్టుగా జైల్లో పడేశారు. మాలో సగం మంది ఘటన జరిగిన ఊరిలో కూడా లేరు.

– మైలారం విష్ణువర్ధన్‌రెడ్డి, లగచర్ల

పోలీసులు విచక్షణారహితంగా కొట్టారు



పోలీసులు దౌర్జన్యంగా మా ఇండ్లలోకి ప్రవేశించారు. రాత్రి ఒంటిగంటకు తలుపులు నెట్టుకుని వచ్చారు. మా ఇంట్లోని ఆడవాళ్లు భయపడుతున్నా కూడా మమ్ములందరినీ విచక్షణ రహితంగా కొట్టారు. మేము ఎవరినైనా ఇబ్బందులు పెట్టమా. మాలాంటి అమాయక రైతులను అరెస్టు చేయడం ఈ ప్రభుత్వానికి న్యాయమేనా. ఏదేమైనా మా భూములు మాత్రమే ఎవ్వరికీయం. ప్రాణాలు అడ్డుపెట్టి అయినా సరే భూములను కాపాడుకుంటాం.

– పాత్లవత్ వినోద్, రోటి బండ తండా

ఫార్ములా ఈ-రేస్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టండి

- ఈ-రేస్‌తో హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచారు
- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-రేస్‌లో ప్రపంచ దేశాలు పోటీపడితే అప్పటి మంత్రి కేటీఆర్ చాకచక్యంతో రాష్ట్రానికి తీసుకొచ్చి హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచారని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఫార్ములా ఈ-రేస్‌లో కేటీఆర్‌పై అక్రమ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఆమె మెదక్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి అవినీతి జరగకున్నా కేటీఆర్‌ను అక్రమంగా అరెస్టు చేయాలని ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. ఈ-రేసు ద్వారా రాష్ట్రానికి రూ.700 కోట్ల ఆదాయం వచ్చిందన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలన్నారు. దీంతో పాటు హైదరాబాద్‌కు ఎలక్ట్రిక్ వాహన సంస్థలు రావడంతో లక్షల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఈ-రేసుకు కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొదట ఆమోదం తెలిపి, తర్వాత రద్దు చేశారన్నారు. అధికార పార్టీకి ధైర్యం ఉంటే అసెంబ్లీ సాక్షిగా ఫార్ములా ఈ రేస్‌పై శాసనసభలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు నాయకులు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, మామిళ్ల ఆంజనేయులు, కృష్ణాగౌడ్, కొట్టాల విశ్వం తదితరులు ఉన్నారు.



మెదక్‌లో మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి,



సంగారెడ్డిలో మాట్లాడుతున్న రావుల శ్రీధర్‌రెడ్డి

కేటీఆర్ అవినీతికి పాల్పడ్డారనడం హాస్యాస్పదం

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఫార్ములా ఈ-రేస్‌లో కేటీఆర్ అవినీతికి పాల్పడ్డారనడం హాస్యాస్పదమని, కక్షపూరిత కేసులు పెట్టి రాక్షసానందం పొందుతున్నారని టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలే కాని అందులో తప్పులను వెతికి సంక్షేమాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. సమావేశంలో సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీహరి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, నర్సింలు పాల్గొన్నారు.

ఆపరేటర్ల తప్పిదం.. ప్రజాపాలన యాప్‌లో నమోదు కాని పేరు

- న్యాయం చేయాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట బాధిత కుటుంబం నిరసన



రసీదును చూపుతున్న కావ్య, పెంటయ్య

శివ్వంపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అధికారుల తప్పిదంతో ప్రజాపాలన యాప్ డేటాలో తమ పేరు లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు సర్వే చేయలేదని గుండ్లపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్త ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన కూడారం కావ్య, పెంటయ్య ఐదేళ్లుగా టార్పాలిన్‌లతో ఏర్పాటు చేసుకున్న గుడిసెలో నివాసం ఉంటున్నారు. గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన సర్వేలో భాగంగా తమ ఇంటికి సంబంధించిన వివరాలను నమోదు చేసినప్పటికీ, ఇందిరమ్మ ఇల్లు యాప్‌లో వారి పేరు లేదని పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుటుంబానికి తెలియజేయడంతో అవాక్కయ్యారు. న్యాయం చేయాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై కార్యదర్శి సంతోష్‌ను సంప్రదించగా ఆపరేటర్ల తప్పిదంతో గుండ్లపల్లి గ్రామానికి చెందిన కావ్య వివరాలు యాప్‌లో వేరే గ్రామమైన గంగయ్యపల్లిలో వచ్చాయని తెలిపారు. ఎంపీడీవో నాగేశ్వరరావు సంప్రదించగా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉపాధ్యాయుడి బదిలీ నిలిపివేయాలని విద్యార్థుల ఆందోళన

శివ్వంపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ నిలిపివేయాలని విద్యార్థులు పాఠశాలను బహిష్కరించి ఆందోళన చేపట్టిన సంఘటన శుక్రవారం కొంతాన్‌పల్లిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని కొంతాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు వెంకటేష్‌ను డిప్యూటేషన్‌పై మండల పరిధిలోని నవాబ్‌పేట్ పాఠశాలకు బదిలీ చేశారు. వెంకటేష్ తెలుగు సారే మాకు కావాలి అంటూ శుక్రవారం పాఠశాల ఎదుట విద్యార్థులు ఆందోళన చేశారు.



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు



సిద్దిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలి

- రూ.26,000 వేతనం చెల్లించాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ
- సిద్దిపేటకు చేరుకున్న బస్ జాత

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్లను పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ అన్నారు. రాష్ట్రవ్యాప్త ఆశా వర్కర్ల సమస్యల కోసం చేపట్టిన బస్సు జాత శుక్రవారం సిద్దిపేటకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు పది లక్షల మంది ఆశా వర్కర్లు ఉన్నారని, 30 ఏళ్ల నుంచి కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా, 20 ఏళ్లుగా ఆశాలు ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్నారని అన్నారు. కానీ వారికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేవని అన్నారు. టార్గెట్‌లు పెడుతూ ఆశాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్య పెంచడంలో, దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి అరికట్టడంలో, గ్రామాల్లో ఆరోగ్య విషయాలలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇన్ని నిర్వహిస్తున్న కూడా ప్రభుత్వం గుర్తించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని లేనిచో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు సిద్ధమవుతామని అన్నారు. పాత బస్టాండ్ నుంచి సిద్దిపేట ప్రెస్‌క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా సహాయకార్యదర్శి చొప్పరి రవికుమార్, ఆశ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో కేక్ కట్ చేస్తున్న బక్కి వెంకటయ్య

కులమతాలకతీతంగా పండుగలు జరుపుకోవాలి

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

దుబ్బాక, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం దుబ్బాకలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ క్రిస్టియన్లకు విందును ఏర్పాటు చేశారు. పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలను తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వనిత భూంరెడ్డి, కౌన్సిలర్లు స్వామి, తహసీల్దార్ సంజీవ్, కమిషనర్ రమేష్, ఎంఈవో ప్రభుదాస్, ఎంపీవో నరేందర్‌రెడ్డి, పాస్టర్లు తదితరులున్నారు.

బతుకమ్మ ఆడి.. నిరసన తెలిపి..

● 11వ రోజుకు సమగ్ర శిక్షా ఉద్యోగుల ధర్నా



బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన ధర్నా 11వ రోజుకు చేరుకుంది. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బతుకమ్మ పేర్చి ఆటపాటలతో ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ధర్నాకు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పులి ప్రసన్న, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్ సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు నగేష్, సాయి, సుమన్, శ్రీకాంత్ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బోధనా పరికరాలు పంపిణీ



విద్యార్థులతో ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు

గజ్వేల్ రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్‌లో అవుట్ రీచ్ విభాగం ఆధ్వర్యంలో తెలుగు, ఇంగ్లిష్, గణితంకు సంబంధించిన బోధనా పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మధునాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు రెహల, కాగ్నిజెంట్ నుంచి రేవంత్‌రెడ్డి, నిఖిత, విక్రమ్ పాల్గొన్నారు.

నార్కోటిక్స్ జాగిలాలతో తనిఖీలు



నార్కోటిక్స్ జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కుకునూరుపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, పిల్లలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో నార్కోటిక్స్ జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట సీపీ ఆదేశాలనుసారం తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లు, ఇతర పదార్థాలను కలిగి ఉన్నా, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మత్తు పదార్థాల సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా ఆంటీ నార్కోటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1982 సమాచారం ఇవ్వాలని తెలిపారు.

మస్త్‌గా ఆడారు..

సీఎం కప్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక



చేర్యాల : విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం అయిలయ్య



వాలీబాల్ పోటీలకు ఎంపికైన లకుడారం యువకులు సాయికుమార్, మణిచందర్

చేర్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్ విద్యార్థులు సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 100మీటర్ల పరుగు పందెంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని కూరాకుల మౌనిక రాష్ట్ర స్థాయికి ఎంపికవడంతో పాటు 400 మీటర్ల విభాగంలో జిల్లా ద్వితీయస్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో తుమ్మ బాలు 100 మీటర్ల పరుగుపందెంలో జిల్లా ద్వితీయస్థానం, 200మీటర్ల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. ఈ మేరకు విద్యార్థులను శుక్రవారం హెచ్ఎం అయిలయ్య, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే కొమురవెల్లి మండలం రసూలాబాద్ గ్రామానికి చెందిన పచ్చిమడ్ల స్వప్న షాట్‌పుట్‌లో, జనగాం నిఖిల్ 800మీటర్ల పరుగుపందెంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

కుకునూరుపల్లి విద్యార్థులు

కుకునూరుపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ పోటీలలో కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో కొంతం సాహితి, కొంత హారిక, బాలుల విభాగంలో మహ్మద్‌ఖలీద్ సత్తా చాటి బంగారు పతకాన్ని సాధించారు. ఈ ముగ్గురు ఈ నెల 27న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో పాల్గొననున్నారు. శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్‌ను ఎంఈవో సత్తయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

లకుడారం యువకులు

సీఎం కప్ క్రీడా పోటీల్లో ఉమ్మడి కొండపాక మండలం లకుడారం గ్రామ యువకులు సత్తాచాటారు. గ్రామానికి చెందిన సాయికుమార్, మణిచందర్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని గ్రామస్థులు సన్మానించారు.

బందారం విద్యార్థులు

కొండపాక, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ వాలీబాల్ పోటీల్లో కొండపాక మండలం బందారం పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రం తెలిపారు. కొండపాక జట్టుకు అండర్ 18 బాలుర విభాగంలో ప్రథమ, బాలికల విభాగంలో ద్వితీయ బహుమతులు లభించాయన్నారు. విద్యార్థులు రాగుల దినేష్, కిన్నెర, మహేష్, తేజ, చింతల అనూష, బట్ట అక్షయ, బట్ట రాణి, కిన్నెర భవాని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.నర్సిరెడ్డి, ఎస్.బాల కనకయ్య, బి. శ్రీనివాస్‌రెడ్డి, పి.భాగ్యలక్ష్మీ, ఎం.మల్లారెడ్డి, సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శనిగరం పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కోహెడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో కోహెడ మండలం శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. కరాటే పోటీల్లో 9వ తరగతి విద్యార్థినులు శ్రీనిధి గోల్డ్‌మెడల్, అంజలి సిల్వర్ మెడల్ సాధించినట్లు హెచ్ఎం సరళ తెలిపారు.



కొండపాక : విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



కుకునూరుపల్లి : విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో సత్తయ్య, ఉపాధ్యాయులు

30 నెలల వరకు పూతను తెంచివేయాలి

● ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి అనిల్



రాయపోల్ : రాంసాగర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయపోల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసిన రైతులు 30 నెలల వరకు చెట్లకు వచ్చే పూతలను తెంచివేయాలని సిద్దిపేట ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి అనిల్, గజ్వేల్ ఏడీఏ బాబూనాయక్ సూచించారు. శుక్రవారం వారు రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పామాయిల్ చెట్లు నాటిన 14 నెలలకు పూత ప్రారంభమవుతుందని, మొక్క 30 నెలల వయసు వచ్చే వరకు లేత దశలో వచ్చే పూతను విధిగా తొలగించాలన్నారు. దీంతో చెట్టు మొదలు భాగం బాగా ఊరుతుందన్నారు. 36 నెలల వయసులో వచ్చే గెలల బరువు బాగా ఉంటుందని, ఎకరానికి ప్రతి సంవత్సరం 10 టన్నుల పామాయిల్ దిగుబడి పొందవచ్చని వివరించారు. ఐదేళ్ల తర్వాత ఆయిల్ పామ్‌లో కోకో పంట కూడా వేసుకొని అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఇప్పటివరకు 11 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో రాయపోల్ ఏవో నరేష్, ఏఈవో ప్రవీణ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన అందించాలి

● డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

మద్దూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన అందించి విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని సలాఖ్‌పూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతులను సందర్శించి బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలను చదివించారు. హాజరు సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు అనేక సంక్షేమ పథకాల్ని అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నూతన మెనూ ప్రకారం భోజనం అందజేతపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వంట ప్రదేశాల్లో శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు.



సలాఖ్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న డీఈవో

ఆటో బోల్తా..

● ఇద్దరికి గాయాలు

రాయపోల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోనాల బాబు అదే గ్రామానికి చెందిన సిర్సనగండ్ల నర్సయ్యతో కలిసి శుక్రవారం పనిమీద ఆటోలో రాయపోల్‌కు వచ్చి తిరిగి గజ్వేల్‌కు వెళ్తున్నారు. మద్దిమడుగు వద్దకు రాగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరు గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు.

ఆటో డ్రైవర్ల అరెస్ట్

మద్దూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్తున్నారన్న సమాచారం మేరకు మండలంలోని లద్నూరు గ్రామ ఆటో డ్రైవర్లను ముందస్తుగా అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్ మహబూబ్ అలీ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు వారికిచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు.

అపూర్వ సమ్మేళనం

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1974వ బ్యాచ్‌కు చెందిన పట్టభద్రులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాల(గోల్డెన్ జూబ్లీ వేడుకలు) పేరిట శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశను గుర్తు చేసుకున్నారు. అప్పటి మధురానుభూతులను, ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడ్డ విషయాలను పరస్పరం చెప్పుకొన్నారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను సన్మానించుకున్నారు. ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి హాజరయ్యారు.



ఆత్మీయసమ్మేళనానికి హాజరైన పట్టభద్రులు

నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి : ఏఐఎస్ఎఫ్

హుస్నాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకవస్తున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ ఇచ్చిన అసెంబ్లీ ముట్టడికి హైదరాబాద్‌కు వెళ్లకుండా హుస్నాబాద్ పోలీసులు ఆయనతోపాటు పలువురిని ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ ప్రజా పాలనపై ప్రశ్నిస్తున్న ఉద్యమ కారులను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో ఆహార నాణ్యత తగ్గిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెండింగ్ ఫీజు రియింబర్స్ మెంట్‌ను విడుదల చేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సర్కారీ స్కూళ్ల స్థలాలకు ఎసరు!

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండే కిచెన్ షెడ్డుకు దగ్గరగా ఉంటుంది. గుబురుగా పెరిగిన చెట్లపొదల నుంచి పాములు తిరిగే అవకాశం ఉంది. పిల్లలు అటువైపుగా వెళ్తే ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● మర్కుక్ మండలం చేబర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోనే పల్లెప్రకృతి వనం, క్రీడామైదానంతో పాటుగా గోపాలమిత్ర నిర్వహణ చేస్తున్నారు. గ్రామాల్లోని పశువులకు చికిత్స చేసేందుకు, ఇంజక్షన్‌లు వేయించడానికి కూడా పాఠశాల ఆవరణను కేంద్రంగా వాడుకుంటున్నారు. మరోవైపు రైతులు తమ ధాన్యం ఆరబెట్టుకోవడానికి కూడా విద్యార్థుల ఆట స్థలాలను వినియోగిస్తున్నారు. గ్రామంలోని కొంత మంది ఔత్సాహిక క్రీడాకారులు ఆటలు ఆడుదామనుకున్నా వారికి నిరాశే ఎదురవుతుంది. రోజంతా స్కూలు, సాయంత్రం అయిదు అయితే గేటుకు తాళం వేసుకుని ఉపాధ్యాయులు వెళ్లిపోతారు. ఎలా చూసినా కూడా క్రీడా మైదానం నిరుపయోగంగా మారుతుంది. పల్లె ప్రకృతి వనంలోకి వెళ్లాలంటే స్కూలు మెయిన్ గేట్ నుంచి మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. ఈ సమస్యపై గ్రామపెద్దలకు, అధికారులకు విన్నవించినా కూడా ఉపయోగం లేదని గ్రామ యువకులు చెబుతున్నారు.



రాయపోల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎమ్మార్సీ భవనం

● జిల్లాలోని సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లి పాఠశాల వెనుక భాగంలో నర్సరీని ఏర్పాటు చేశారు. అక్బర్‌పేట మండలం భూంపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలోనే క్రీడా ప్రాంగణం ఉంది. కొమురవెల్లి మండలం గౌరాయపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు కానీ పరికరాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. రాయపోల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో క్రీడా ప్రాంగణం, ఇందులోనే ఎమ్మార్సీ భవనం కూడా పాఠశాల ఆవరణలోనే ఉంది. కుకునూర్‌పల్లి మండలం తిప్పారం పాఠశాల ఆవరణలో క్రీడా ప్రాంగణం, ఎల్లయ్యగూడ పాఠశాలలో ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. చిన్నకోడూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో క్రీడా మైదానం ఏర్పాటు చేశారు. గజ్వేల్ మండలం కొడకండ్ల పాఠశాల ఆవరణలో క్రీడామైదానం ఏర్పాటు చేశారు. దీంతో ఆవరణ అంతా ఇరుకుగా మారిందని స్థానికులు చెబుతున్నారు. సిద్దిపేట డిగ్రీ కాలేజీ, మల్టీపర్పస్ హైస్కూల్లో క్రీడా ప్రాంగాణాలు ఏర్పాటు చేశారు. ఇలా జిల్లావ్యాప్తంగా చాలావరకు విద్యాసంస్థలకు సంబంధించిన స్థలాల్లో సామాజిక అవసరాల పేరుతో పలు అంశాలను గ్రౌండ్‌లోకి తీసుకోస్తున్నారు. దీనివల్ల భవిష్యత్‌లో బడుగు బలహీనవర్గాలకు పిల్లలకు సర్కార్ బడి దూరమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల స్థలాలను సంరక్షించాలని కోరుతున్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ

న్యూస్ నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై దళిత, ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లావ్యాప్తంగా శుక్రవారం నిరసనలు కొనసాగాయి. చేర్యాల, దుబ్బాక, మిరుదొడ్డిలో అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. కొండపాక మండలం దుద్దెడలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ములుగు మండలం మామిడ్యాల, వంటిమామిడి రాజీవ్ రహదారి చౌరస్తాలో షా చిత్రపటాన్ని దహనం చేశారు. కొడకండ్ల గ్రామ అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీగా వెళ్లి రాజీవ్ రహదారి చౌరస్తాలో అమిత్ షా దిష్టి బొమ్మను దహనం చేశారు. పలువురు నేతలు మాట్లాడుతూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పి, పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

'ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న ప్రభుత్వం'

న్యూస్ నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి) : ఈ-ఫార్ములా రేసు విషయంలో కేసులు పెట్టి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రతిష్ట దిగజార్చాలనుకోవడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లు ఆ పార్టీ నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేటీఆర్‌పై కక్షసాధింపుచర్యలకు ప్రభుత్వం ఒడిగట్టడం శోచనీయమన్నారు. ప్రతిపక్షాల గొంతునొక్కేందుకు పాకులాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. రాజకీయంగా బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కోలేకనే కేటీఆర్‌పై అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రేస్‌కు సంబంధించి అన్ని నిజాలను రాష్ట్ర ప్రభుత్వం దాచిపెడుతుందని ఆరోపించారు. కేటీఆర్ ఎలాంటి అవినీతి చేయలేదని, దమ్ముంటే ఈ విషయమై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతీకార పాలనకు, పాపిష్టి పాలనకు కేటీఆర్‌పై కేసు పెట్టడమే ఉదాహరణ అన్నారు. తమకు న్యాయస్థానాల మీద అపార గౌరవం ఉందని, ఉద్యమకాలంలో కూడా ఇలాంటి కేసులెన్నో ఎదుర్కొన్నామని, భయపడే పరిస్థితి లేదని చెప్పారు.

న్యూస్ బాక్స్

గెస్ట్ టీచర్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరానికి సోషల్ బోధనకు గెస్ట్ టీచర్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి రాజిరెడ్డి శుక్రవారం తెలిపారు. బీఈడీ అర్హత కలిగి ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం వరకు మాత్రమే పనిచేయవలిసి ఉంటుందని, వేతనం నెలకు రూ.18 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగినవారు ఈ నెల 24 వరకు రాఘావాపూర్‌లోని కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని,మెరిట్, డెమో ప్రకారం ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

పశువుల పాకను కూల్చిన దుండగులు

గజ్వేల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన రాజాగౌడ్‌కు చెందిన పశువుల పాకను గుర్తు తెలియని దుండగులు కూల్చివేశారు. శుక్రవారం ఉదయం వెళ్లి చూసేసరికి పశువుల పాక కూలిపోయి ఉండడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరుపల్లి పోలీసులు తెలిపారు.

హైమాస్ట్ లైట్లకు రూ.23 లక్షలు

మద్దూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.23 లక్షల నిధులు కేటాయించినట్లు చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి విన్నపంతో నిధులు కేటాయించారన్నారు. ఈ సందర్భంగా వారికి పలు మండలాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



రాయపోల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాహనంలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. రాయపోల్ ఎస్‌హెచ్‌వో దేవయ్య కథనం ప్రకారం రాయపోల్ మండలం దొడ్డపల్లి శివారులో గురువారం సాయంత్రం టాటా ఏస్ వాహనంలో తరలిస్తున్న 7 క్వింటాళ్ల 60 కిలోల ఎడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. అనంతరం వడ్డెపల్లి శివారులోని ఓ పౌల్ట్రీఫామ్‌లో తనిఖీ చేయగా 5 క్వింటాళ్ల 20 కిలోల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. శుక్రవారం రాయపోల్ గిర్దావార్ భానుప్రకాష్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని దౌల్తాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

మిరుదొడ్డి,డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలం బేగంపేట, రుద్రారం, మల్లుపల్లి, ఖాజీపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన పరిశీలించారు.

మల్లన్న కల్యాణ ఆహ్వాన పత్రికల అందజేత

చేర్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న కల్యాణం ఈ నెల 29వతేదీన జరగనున్న నేపథ్యంలో ఆలయాధికారులు శుక్రవారం సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనూరాధకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మార్యదపూర్వకంగా వారివారి కార్యాలయాలలో కలిసి అర్చకులే వేదాశీర్వచనమందించి పత్రిక, స్వామివారి ప్రసాదం అందించారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు

మిరుదొడ్డి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని రన్‌ఫర్ యాంటీ డ్రగ్స్ ఆర్గనైజర్ తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి మండలం పెద్దచెప్యాల గ్రామంలో 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాలనే నాశనం చేసే డ్రగ్స్‌ను తరమివేయడానికి నడుం బిగించాలన్నారు. నాయకులు సత్యనారాయణ, లింగం, రాజు, ఎల్లం,కుమార్ పాల్గొన్నారు.

బలగం మొగిలయ్య మృతి కళారంగానికి తీరనిలోటు

హుస్నాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బలగం మొగిలయ్య మృతి కళారంగానికి తీరనిలోటని హుస్నాబాద్‌కు చెందిన టీవీ, రేడియో జానపద గాయకులు గడిపె మల్లేశ్ అన్నారు. శుక్రవారం ఆయన మొగిలయ్య మృతిపై సంతాపం తెలిపారు. బలగం సినిమాలో మొగిలయ్య పాట ప్రజలను కన్నీరు పెట్టించిందన్నారు.